అనుదినం జనపక్షం
www.navatelangana.com
నవతెలంగాణ
సమగ్ర తెలంగాణ దినపత్రిక
ఆదిలాబాద్, నిర్మల్, మంచిర్యాల
కుమురం భీం-ఆసిఫాబాద్
బుధవారం 08 మార్చి 2023

సోమగూడెంలో మహిళలకు ఆటల పోటీలు

కాసిపేట : సోమగూడెం భరత్‌కాలనీ గ్రామ పంచాయతీ ఆవరణలో సర్పంచ్ ప్రమీలాగౌడ్ ఆధ్వర్యంలో మహిళా దినోత్సవం సందర్భంగా మహిళకు ఆటల పోటీలు నిర్వహించారు. ఆటల పోటీల్లో మహిళలు ఉత్సాహంగా పాల్గొన్నారు. ఈ పోటీల్లో గెలుపొందిన వారికి బహుమతులు ప్రదానం చేయనున్నట్లు సర్పంచ్ ప్రమీలాగౌడ్ తెలిపారు. ఈ సందర్భంగా సర్పంచ్ మాట్లాడుతూ మహిళా దినోత్సవ సందర్భంగా మహిళలకు వివిధ పోటీలు నిర్వహించామని, మహిళా దినోత్సవం రోజు బహుమతులు ఇస్తామని పేర్కొన్నారు. మహిళలు అన్ని రంగాల్లో ముందుండి విజయం సాధించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు సభ్యులు జాడి ప్రమీలా, సల్మా, నాయకులు ఊరగొండ జ్యోతి, దూడం తిరుమల, దొంతల లక్ష్మీ, మహిళలు పాల్గొన్నారు.



విద్యార్థులకు బ్యాగులు, నోట్ పుస్తకాలు విరాళం

ఆసిఫాబాద్ : జిల్లా కేంద్రంలోని అర్బన్ రెసిడెన్షియల్ పాఠశాలలో చదువుతున్న 84 మంది నిరుపేద విద్యార్థులకు సిర్పూర్ పేపర్ మిల్ యాజమాన్యం స్కూల్ బ్యాగ్స్, నోట్ పుస్తకాలు అందించింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సిర్పూర్ పేపర్ మిల్ వైస్ ప్రెసిడెంట్ ఏకే మిశ్రా మాట్లాడుతూ ప్రతి విద్యార్థి జీవితంలో ఒక లక్ష్యాన్ని ఏర్పరుచుకోవాలని, ప్రతిరోజు ఆ లక్ష్యాన్ని మననం చేసుకోవాలని తెలిపారు. లక్ష్యాన్ని చేరుకునే దాకా నిరంతరం ప్రణాళికాబద్ధంగా శ్రమించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పేపర్ మిల్ మేనేజర్ ఎం.గిరివిద్యాశాఖ కోఆర్డినేటర్ సత్యనారాయణ మూర్తి, పాఠశాల ప్రత్యేక అధికారి ముంజం ధర్మయ్య పాల్గొన్నారు.



అతివకు ఆదరణేది..!

- స్థానిక సంస్థల్లో సగం మంది మహిళా ప్రజాప్రతినిధులే
- కానీ అధికారిక కార్యక్రమాల్లో లభించని సమ ప్రాధాన్యం
- మహిళలపై తగ్గని గృహహింస, వేధింపులు
- చట్టాలు పకడ్బందీ అమలుతోనే కట్టడి సాధ్యం
- నేడు అంతర్జాతీయ మహిళా దినోత్సవం

ఆకాశంలో సగం..అవనిలో సగం..అన్నింటిలో సగభాగమని అతివల గొప్పతనం గురించి సగర్వంగా చెప్పుకుంటున్నాం. ధైర్యసాహసాలతో ఆకాశంలో విమానాలను నడిపిస్తూ..శాస్త్రవేత్తలుగా రాణిస్తూ..కదనరంగంలో శత్రుదేశాలతో పోరాడుతూ.. దేశ పరిపాలనతో పాటు అత్యున్నత ఉద్యోగాలు, పదవుల్లో రాణిస్తూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారు. అయినప్పటికీ క్షేత్రస్థాయిలో పరిస్థితులు మాత్రం ఇంకా తిరోగమన రూపంలో కనిపిస్తుండటం ఆందోళనకరంగా మారుతోంది. పురుషాధిక్యత కలిగిన ఈ సమాజంలో కొందరు మహిళలు ఇంకా వివిధ రూపాల్లో వివక్షను ఎదుర్కొంటూనే ఉన్నారు. ఇప్పటికీ అనేక మంది మహిళలు వివిధ రూపాల్లో హింసను ఎదుర్కొంటున్నారు. ఉమ్మడి జిల్లాలో రాజకీయంగానూ స్థానిక సంస్థల కోటాలో సగం మంది ప్రజాప్రతినిధులు ఉన్నప్పటికీ.. సమావేశాల్లో మాత్రం వారికి అంతగా ప్రాధాన్యం లభించడం లేదనే అపవాదు ఉంది. మరోపక్క ఏటా మహిళలపై గృహహింస, వేధింపుల కేసులు తగ్గుముఖం పట్టడం లేదని గణాంకాలు చెబుతున్నాయి. చట్టాలను పకడ్బందీగా అమలు చేయడంతోనే మహిళలపై దాడులను అరికట్టవచ్చనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. బుధవారం అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రత్యేక కథనం..

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

మహిళలు లేనిదే ఈ సమాజమే లేదనేది కాదనలేని సత్యం. ఇంతటి ప్రాముఖ్యత కలిగిన మహిళల పట్ల ఇంకా వివక్ష కొనసాగడం దురదృష్టకర పరిణామం. రోజురోజుకు వారిపై దాడులు, గృహహింస, వేధింపుల కేసులతో పాటు అఘాయిత్యాలు పెరగడం ఆందోళనకరంగా మారుతోంది. పకడ్బందీ చట్టాలున్నా ఏదో రూపంలో వేధింపులు చోటుచేసుకుంటున్నాయి. దోషులపై పోలీసు కేసులు నమోదవుతున్నా.. న్యాయస్థానాల్లో శిక్షలు పడుతున్నా పూర్తిస్థాయిలో తగ్గుముఖం పట్టడం లేదు. పోలీసుశాఖ ఏటా వెల్లడించే నేర గణాంకాలు ఇందుకు ఉదాహరణలుగా నిలుస్తున్నాయి. ఆదిలాబాద్ జిల్లాలో ఒక్క 2022 ఏడాదిలోనే 278 కేసులు నమోదయ్యాయి. ముఖ్యంగా మహిళల భద్రత కోసం ప్రభుత్వం ప్రత్యేకంగా షీటీంలు ఏర్పాటుచేసింది. ఈ బృందాలు సైతం చాలా వరకు ఆకతాయిలను అరికడుతున్నా.. ఎక్కడోచోట వేధింపులు జరుగుతునే ఉండటం ఆందోళనకరంగా మారుతోంది. ముఖ్యంగా గృహహిసం, వేధింపులు తదితర ఘటనలు చోటుచేసుకుంటున్నాయి. మహిళల భద్రత కోసం ప్రభుత్వాలు అనేక చట్టాలను తీసుకొచ్చాయి.



వాటిని పకడ్బందీగా అమలు చేస్తేనే అతివలకు అభయం ఉంటుందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది.

పురుషులదే పెత్తనం..!

ఉమ్మడి జిల్లాలో స్థానిక సంస్థల్లో సగం మంది మహిళా ప్రజాప్రతినిధులు ఉన్నారు. సుమారు సర్పంచ్‌లు, ఎంపీటీసీలు, జడ్పీటీసీల్లో సగం మంది అతివలే ప్రాతినిధ్యం వహిస్తున్నారు. సభలు, సమావేశాల్లో కొందరు మహిళా ప్రజాప్రతినిధులు గళమెత్తుతున్నా.. మరికొందరు మాత్రం ఆ ప్రభావం చూపించడం లేదు. ముఖ్యంగా కొన్ని సమావేశాలకు భార్యల స్థానంలో భర్తలు హాజరుకావడం, లేదంటే వారి కుటుంబ సభ్యులు పాల్గొనడం వంటి పరిణామాలు చోటుచేసుకుంటున్నాయి. ఈ విషయం ఉన్నతాధికారుల దృష్టికి పలుమార్లు వెళ్లినా దృష్టిసారించిన దాఖలాలు కనిపించడం లేదనే విమర్శలున్నాయి. దీంతో మహిళా ప్రజాప్రతినిధులు కేవలం పేరుకే పరిమితమవుతున్నారు. పెత్తనం మాత్రం వారి కుటుంబ సభ్యులదిగా మారుతోంది.



అధికారులు, ప్రజాప్రతినిధులుగానూ రాణింపు

కొందరు మహిళలు వివిధ శాఖల ఉన్నతాధికారులుగా కీలకంగా వ్యవహరిస్తున్నారు. ప్రజలకు ప్రభుత్వ పథకాలను చేరవేయడంలో సమర్థవంతంగా పనిచేస్తు మంచి గుర్తింపు సాధిస్తున్నారు. వీరితో పాటు కొందరు మహిళలు జనరల్ సీట్లలోనూ ప్రజాప్రతినిధులుగా రాణిస్తున్నారు. అనర్గళ వాగ్ధాటితో రాజకీయాల్లో కీలకంగా వ్యవహరిస్తున్నారు.



వీరితో పాటు అనేక మంది వివిధ వ్యాపారాలను విజయవంతంగా నిర్వర్తిస్తూ మంచి పేరు తెచ్చుకుంటున్నారు. మరికొందరు ఉపాధ్యాయులుగా విధులు నిర్వర్తిస్తూ అనేక మంది విద్యార్థులను భావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్నారు. మరికొందరు శాస్త్రవేత్తలుగా, వైద్యులుగా వివిధ రంగాల్లో సేవలందిస్తూ ప్రత్యేక గుర్తింపు సాధిస్తున్నారు.

ఘనంగా హోళీ వేడుకలు

- చిన్నాపెద్ద తేడా లేకుండా సంబరాలు
- సహజ రంగులకు అధిక ప్రాధాన్యత
- వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు



నవతెలంగాణ-ఆసిఫాబాద్, ఆదిలాబాద్

హోళీ పండుగ వేడుకలను ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లాలో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. చిన్నాపెద్ద తేడా లేకుండా సంబరాల్లో మునిగితేలారు. ఉదయం నుండే రోడ్లపైకి వచ్చి ఒకరిపై ఒకరు రంగులు చల్లుకున్నారు. జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి తన కుటుంబ సభ్యులతో కలిసి హోళీ వేడుకలు నిర్వహించుకున్నారు. ఆదిలాబాద్‌లో కలెక్టర్ రాహుల్‌రాజ్, ఎస్పీ ఉదయ్‌కుమార్‌రెడ్డి హోళీ వేడుకల్లో పాల్గొన్నారు. ఆసిఫాబాద్ పట్టణంలోని రావులవాడ, టిఆర్ నగర్, సందీప్‌నగర్ ప్రాంతాలలో చిన్న పిల్లలు, యువతీయువకులు, మహిళలు రంగులు చల్లుకున్నారు.

వేడుకల్లో పాల్గొన్న ప్రముఖులు

కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ బొర్కడే హేమంత్‌ను కలిసి మీడియా సభ్యులతో పాటు పలువురు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హోళీ పండుగ ప్రతి ఒక్కరి జీవితంలో రంగులు నింపాలని ఆకాంక్షించారు. జడ్పీ చైర్‌పర్సన్ కోవ లక్ష్మి, ఎమ్మెల్యే ఆత్రం సక్కు, డిఎస్‌పి శ్రీనివాస్, జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు క్యాంపు కార్యాలయాల్లో వేడుకల్లో పాల్గొన్నారు.

బీసీ సంఘం, బీజేపీ ఆధ్వర్యంలో ర్యాలీ

హోళీ వేడుకలను పురస్కరించుకొని జిల్లా బీసీ సంఘం ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలో బ్యాండ్ మేళాలతో భారీ ర్యాలీ నిర్వహించి అందరికీ హోళీ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు రూప్నర్ రమేష్, రైతు సంఘం అధ్యక్షుడు మారుతి పటేల్, నాయకులు కోట వెంకన్న, ప్రణయ్, నాగరాజ్, ప్రశాంత్, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు ఖాండ్రే విశాల్, ఎస్సీ మోర్చా జిల్లా ఉపాధ్యక్షులు మాటూరి జయరాజ్, ఆసిఫాబాద్ మండల అధ్యక్షులు ఈదులవాడ గణేష్, మండల ప్రధాన కార్యదర్శి రత్నం రవీందర్, బీజేవైఎం అధ్యక్షులు మోహన్, కిసాన్ మోర్చా అధ్యక్షులు అకంతరావు, నాయకులు కొడగంటి తిరుపతి, దీపక్, బన్నీ, సంపత్ అశోక్, పౌల్, నాగేష్, సమ్మయ్య, తిరుపతి, సారయ్య కళ్యాణ్, సాయి, అశోక్ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌లో..

హోళీ పండగను బంధుమిత్రులు, ఉద్యోగులు, అధికారులతో ప్రశాంతంగా కలర్ ఫుల్‌గా నిర్వహించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ పిఎస్ అన్నారు. మంగళవారం హోళీ పండుగ సందర్భంగా తన క్యాంపు కార్యాలయంలో అధికారులు, ఉద్యోగులు, ప్రజాప్రతినిధులతో కలిసి వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వేడుకల అనంతరం చెరువులు, వాగుల్లో స్నానాలు చేసే ముందు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఎస్పీ డి.ఉదయ్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజలందరూ ప్రశాంత వాతావరణంలో హోళీ వేడుకలు నిర్వహించుకోవాలని తెలిపారు. మధ్యాహ్నం 12గంటల అనంతరం వాహనాలు నడిపే సమయంలో సంయమనం పాటించాలని, ప్రమాదాలు జరగకుండా చూసుకోవాలని కోరారు. పోలీస్ అధికారులు, సిబ్బంది ఎస్పీ క్యాంపు కార్యాలయం నుండి భాజాభజంత్రీలు, ఆటపాటలతో కలెక్టర్ క్యాంపు కార్యాలయానికి చేరుకున్నారు. కలెక్టర్ దంపతులకు హోళీ శుభాకాంక్షలు తెలిపారు. కలెక్టర్‌కు రంగులు పూశారు. కలెక్టర్, ఎస్పీ, పోలీస్ సిబ్బంది నృత్యాలు చేశారు. ఎమ్మెల్యే జోగు రామన్న, డిసిసిబి చైర్మన్ అడ్డి భోజారెడ్డి, అర్డీఓ రమేష్ రాథోడ్, జిల్లా గ్రంథాలయ చైర్మన్ ఆర్.మనోహర్, జడ్పీటీసీలు, వివిధ కుల, ఉద్యోగ సంఘాల ప్రతినిధులు, కలెక్టర్ క్యాంపు సిబ్బంది, మీడియా ప్రతినిధులు, పలువురు ఉద్యోగులు కలెక్టర్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో..

జాతీయ చేనేత ఐక్యవేదిక, పద్మశాలీ సంఘం ఆధ్వర్యంలో ఎమ్మెల్యే జోగు రామన్నను మర్యాదపూర్వకంగా కలిసి హోళీ శుభాకాంక్షలు తెలిపారు. జాతీయ చేనేత ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షులు దాసరి రమేష్, రాష్ట్ర కార్యదర్శి మోర ఆశన్న, రాష్ట్ర సహాయ కార్యదర్శులు గాజుల హన్మండ్లు, దాసరి ఆశన్న, పద్మశాలీ సంఘం ఉపాధ్యక్షులు బూర్ల శంకరయ్య, పెంట వెంకన్న, తాలూకా ఉపాధ్యక్షులు అనుముల ఊశన్న, ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ మాజీ డైరెక్టర్ మంచు ఆశన్న, పోపా ఉపాధ్యక్షులు కటకం మహేష్, ప్యారం అశోక్, రిటైర్డ్ పోస్ట్ మాస్టర్ జంజీరాల బాపు శుభాకాంక్షలు తెలిపిన వారిలో ఉన్నారు.



వ్యాపార శిఖామణులు ఆసిఫాబాద్ మహిళలు

- ఆదర్శంగా నిలుస్తూ..ఆర్థిక అభివృద్ధి సాధిస్తూ..
- ప్రభుత్వ చేయూతతో ముందుకు సాగుతున్న వైనం

నవతెలంగాణ-ఆసిఫాబాద్

సృష్టిలో సగం.. ఆకాశంలో సగం.. లాంటి పదాలు వాడుతున్నప్పటికీ మహిళలు పూర్తిస్థాయిలో అన్ని రంగాల్లో ముందుకు సాగడం లేదని అభిప్రాయం వ్యక్తం చేస్తున్న వారికి మేమేమీ తక్కువ కాదంటున్నారు ఈ మహిళామణులు. పురుషులతో సమానంగా వ్యాపారం చేస్తూ, ఆర్థిక అభివృద్ధి సాధిస్తూ తమకు తిరుగు లేదని నిరూపించుకుంటున్నారు కుమురంభీం జిల్లా మహిళా సంఘాల సభ్యులు. జిల్లాలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న మహిళల అభివృద్ధి కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటూ ముందుకు సాగుతున్న స్వయం సహాయక సంఘాల అభివృద్ధిపై ప్రత్యేక కథనం..

స్వయం సహాయక సంఘాల కూర్పు

జిల్లాలో గ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో మహిళల అభివృద్ధి కోసం స్వయం సహాయక సంఘాలకు ప్రభుత్వ నుండి అనేక పథకాలు అందేలా చూస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 7,953 స్వయం సహాయక సంఘాలు పనిచేస్తుండగా వీటిలో 87,947 సభ్యులు ఉన్నారు. వీరి యొక్క పనితీరుపై ఎప్పటికప్పుడు అధికారులు సమీక్ష చేస్తూ వారికి అవసరమైన సలహాలు సూచనలు అందిస్తున్నారు.

సభ్యుల ఆర్థిక అభివృద్ధి కోసం చర్యలు

రాష్ట్రవ్యాప్తంగా ఏ జిల్లాలో లేని విధంగా మహిళా



స్వయం సహాయక సంఘాల సభ్యుల ఆర్థిక అభివృద్ధి కోసం అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. దీనిలో భాగంగానే జిల్లా కేంద్రంలో రూ.50 లక్షల వ్యయంతో మహిళా సంఘాల ఆధ్వర్యంలో బెలూన్ థియేటర్ రూపొందించారు. దీనితో పాటు చిరుధాన్యాల సేకరణ నిర్వహణకు సంబంధించి ప్రత్యేకంగా రూ.40 లక్షల వ్యయంతో సాలెగూడ వద్ద సేకరణ కేంద్రం ఏర్పాటు చేశారు. అలాగే జిల్లాలో ఎక్కువగా దొరికే తేనె సేకరణ కేంద్రాలు, పాల కేంద్రం తో పాటు, సూపర్ మార్కెట్ లాంటివి ఏర్పాటు చేశారు. ఇప్పటికే చిరుధాన్యాల కేంద్రం బెలూన్ థియేటర్‌తో పాటు తేనె సేకరణ లాభసాటిగా నడిచి ఆర్థిక అభివృద్ధి బాటన పయనిస్తున్నారు. బ్యాంకు రుణాలను కూడా 90 శాతం చేరుకొని లక్ష్యానికి దగ్గరగా వచ్చారు.

పనితీరుకు అద్దం పడుతున్న అవార్డులు

మహిళా సంఘాల అభివృద్ధి కోసం అధికారులు తీసుకుంటున్న చర్యలను సద్వినియోగం చేసుకొని సభ్యులు ముందుకు సాగుతున్నారు. దీనిలో భాగంగానే గత సంవత్సరం రాష్ట్రవ్యాప్తంగా జిల్లా సమాఖ్య ఉత్తమ అవార్డు రావడం పనితీరుకు అర్థం పడుతుంది. అప్పటి జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ చేతుల మీదుగా అవార్డు అందుకున్నారు. దీనితో పాటు జిల్లాలో ఆసిఫాబాద్, రెబ్బెన, కాగజ్ నగర్ మండలాలను ఆదర్శ మండల సమాఖ్యలుగా రూపొందించారు.

మహిళలు తమ కాళ్లపై తాము నిలబడాలి : సురేందర్, జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ అధికారి

మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందడంతో పాటు తమ కాళ్లపై తాము నిలబడే విధంగా ఉండాలి. అలా చేయడానికి చేస్తున్న కృషిలో భాగమే మహిళా సంఘాల అభివృద్ధికి జిల్లాలో వివిధ రకాల కార్యక్రమాలు. వాటిని సద్వినియోగం చేసుకుంటూ బెలూన్ థియేటర్, చిరుధాన్యాల నిర్వహణ కేంద్రం లాభాల బాటలో కొనసాగుతుంది. భవిష్యత్తులో మరిన్ని కార్యక్రమాల రూపకల్పనకు ఇవి ఊతం ఇస్తాయి.





ఆసిఫాబాద్‌లో..



ఆసిఫాబాద్‌లో వేడుకల్లో కలెక్టర్ హేమంత్ బోర్కాడే



ఆదిలాబాద్ రూరల్‌లో..



ఆదిలాబాద్‌లో..



డీపీఆర్ఓకు రంగు పూస్తున్న ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్‌రాజ్



ఆదిలాబాద్‌లో..



కొటాలలో..



రెబ్బెన : హోళీ వేడుకల్లో బెల్లంపల్లి ఏరియా జీఎం దేవేందర్

మహిళలు అన్ని రంగాల్లో రాణించాలి

నవతెలంగాణ-నార్నూర్



మహిళలు అన్ని రంగాల్లో రాణించాలని నాగల్‌కొండ సర్పంచ్ జాదవ్ సునీత నారాయణ్ అన్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని తాను ఒక మహిళ సర్పంచ్‌గా చేసిన కృషిని గురించి నవతెలంగాణతో మాట్లాడారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో సమానంగా పోటీపడుతూ రాణించాలి. తాను నాలుగేండ్ల గ్రామపంచాయతీ పాలనలో సర్పంచ్‌గా చేసిన గ్రామాభివృద్ధిపై వివరించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు కృషి చేశాను. గ్రామంలో పేదప్రజలకు తనవంతు సాయం అందిస్తున్నట్లు తెలిపారు. ఇంకా ముందు ముందుకు గ్రామ ప్రజల సహకారంతో ఎప్పుడు ఎవరు చేయని విధంగా గ్రామాన్ని మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తానని అన్నారు.

మహిళల అభ్యున్నతికి కృషి

నవతెలంగాణ-దిలావర్‌పూర్



మహిళ అభ్యున్నతికి కృషి చేస్తున్నట్టు ఎంపీపీ పాల్దే అక్షరఅనిల్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఎంపీపీ నవతెలంగాణతో మాట్లాడారు. సమాజంలో మహిళలు పాత్ర కీలకమని, మహిళలు లేనిదే సమాజం లేదని అన్నారు. మారుతున్న కాలం కొంతపుంతలు తొక్కుతూ మహిళలు ఆయా రంగాల్లో రాణిస్తున్నారు. తమకంటూ స్థానాన్ని సంపాదించుకుంటున్నారు. అన్ని రంగాల్లో ముందడుగు వేస్తూ, పురుషుల కంటే తామేమి తక్కువకాదని నిరూపిస్తున్నారు. స్త్రీ లేనిదే పురుష మనుగడలేదని, అందుకే స్త్రీని గౌరవించడం మనందరి బాధ్యత అన్నారు. ఎంపీపీగా నాకు అవకాశం కల్పించినందుకు ఎల్లవేళలా మండల అభివృద్ధికి కృషి చేస్తానని అన్నారు.

ఘనంగా హోలీ పండుగ వేడుకలు



ఆదిలాబాద్‌టౌన్‌లో..



నార్నూర్‌లో..



నార్నూర్‌లో..



ఉట్నూర్‌లో..

నవతెలంగాణ-ఉట్నూర్

హోలి పండుగను మండలంలో మంగళవారం ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఉదయం నుంచి పట్టణంలో, గ్రామాల్లో యువత, చిన్నారులు రంగు రంగుల కలర్లను చల్లుకుంటూ కేరింతలతో హోరెత్తించారు. గిరిజన గ్రామాల్లో గిరిజనులు వారి సంప్రదాయం ప్రకారం పూజలు చేసి జాజీరి.. జాజీరి.. అంటూ డోలుతో సాంప్రదాయ నృత్యాలు చేశారు. ఇంటింటికీ తిరుగుతూ హోలి వేడుకలు నిర్వహించుకున్నారు. పట్టణంలోని జెడ్పీ చైర్మెన్ రాథోడ్ జనార్దన్, మాజీ ఎంపీ రాథోడ్ రమేష్ వేడుకల్లో పాల్గొన్నారు. మండలంలోని ఘన్‌పూర్ గ్రామంలో ఎంపీపీ పంద్రా జైవంత్ రావ్ బీఆర్‌ఎస్ నాయకులతో కలిసి సంబరాలు చేసుకున్నారు. హోలి పల్లెల్లో పండుగ వాతావరణం నెలకొంది.

తాంసి: మండలంలోని ఆయా గ్రామాల్లో హోలీ పండుగను పురస్కరించుకొని మంగళవారం చిన్న పెద్ద తేడా లేకుండా యువతీ, యువకులు ఒకరికొకరు రంగులు చల్లుకొని ఎంతో ఆనందంగా నిర్వహించుకున్నారు. యువకులు ఉట్టి కొట్టారు. హోలి సంబరాల్లో ప్రజాప్రతినిధులు, ఎమ్మెల్యే, ఎంపీ, డీసీసీబీ చైర్మెన్‌లకు రంగులు చల్లుకొని శుభాకాంక్షలు తెలియజేసుకున్నారు.

నార్నూర్: ఉమ్మడి మండలంలోని అదివాసీ గిరిజన గ్రామాల్లో మంగళవారం ఊరూరా హోలీ పండుగను ప్రజలు ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్న పెద్దా తేడా లేకుండా, యువతీ, యువకులు మహిళలు తేడా లేకుండా ఒక్కరికొకరు రంగులు చల్లుకుంటూ కేరింతలు వేసి సంబురాలు చేశారు. ఆదివాసీ గిరిజన గ్రామాల్లో మహిళలు యువకులు సంస్కృతి సాంప్రదాయ బద్ధంగా పాటలు పడుతూ నృత్యాలు చేశారు. ముందుగా ఒక్కరికొకరు శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం యువకులు వనభోజనం చేశారు.

బాసర: మండల కేంద్రంలో పాటు ఆయా గ్రామాల్లో మంగళవారం హోలీ సంబరాలను పెద్దలు యువకులు చిన్నారులు ఆనందోత్సవాల మధ్య ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ పండుగ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. సర్పంచ్ లక్ష్మణరావు మండల ప్రజలకు పండుగ శుభాకాంక్షలు తెలిపారు.

ఆదిలాబాద్‌టౌన్: హోలీ వేడుకలను ఆదిలాబాద్ జిల్లా వ్యాప్తంగా మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్న, పెద్ద తేడా లేకుండా ఉత్సాహంగా హోలీ సంబరాల్లో పాల్గొన్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ఒకరిపై ఒకరు రంగులు చల్లుకుని సంతోషం వ్యక్తం చేశారు. రసాయన రంగులు వాడకుండా సహజ రంగులు వినియోగించి సంతోషంగా నిర్వహించుకున్నారు. డీజేలు ఏర్పాటు చేసి ఉత్సాహంగా నృత్యాలు చేస్తూ, ఆనంద ఉత్సవాల నడుమ మునిగితేలారు.

పోలీసు అధికారులతో హిందూఉత్సవ సమితి సభ్యుల హోలీ..

జిల్లా ఎస్పీ ఉదయ్ కుమార్ రెడ్డి, డీఎస్పీ ఉమేందర్‌తో పాటు వివిధ పోలీస్ అధికారులతో కలిసి సనాతన హిందూ ఉత్సవ సమితి సభ్యులు హోలీ వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించుకున్నారు. పోలీసు అధికారులకు సమితి అధ్యక్షుడు ప్రమోద్ కుమార్ ఖత్రితో పాటు పలువురు సభ్యులు రంగులు పూసి పండగ శుభాకాంక్షలు తెలియజేశారు. హోలీ వేడుకలను ఆనందోత్సవాల మధ్య



ఆదిలాబాద్‌టౌన్‌లో..

నిర్వహించుకున్నారు. కార్యక్రమంలో సమితి ప్రధాన కార్యదర్శి గెడం మాధవ్, సభ్యులు రవీందర్, తోట పరమేశ్వర్, పడకంటి సూర్యకాంత్, గౌరువార్ సతీష్, బండారి దేవన్న, మహిపాల్ పాల్గొన్నారు.

హోలీ వేడుకల్లో ఎంపీ సోయం...

ఎంపీ సోయం బాపురావు నివాసంలో హోలీ వేడుకలు ఘనంగా జరిగాయి. మంగళవారం పట్టణంలోని సరస్వతినగర్ కాలనీలో గల ఎంపీ నివాసంలో బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్‌తో పాటు పార్టీ నాయకులు సోయం బాపురావుకు హోలీ శుభాకాంక్షలు తెలిపారు. హిందువులు సంస్కృతి సాంప్రదాయాలకు అనుగుణంగా పండుగ నిర్వహించుకోవాలని ఈ సందర్భంగా ఎంపీ సూచించారు.

అంగన్‌వాడీలో హోలీ వేడుకలు..

హోలీ పండుగను జిల్లా వ్యాప్తంగా ఘనంగా నిర్వహించుకున్నారు. ఇందులో భాగంగా మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని సుందరయ్యనగర్‌లోని అంగన్‌వాడి సెంటర్‌లో చిన్నారులు ఒకరిపై ఒకరు రంగులు చల్లి సందడి చేశారు. సెంటర్ నిర్వాహకురాలు రాధా చిన్నారులకు వివిధ ఆకృతుల గల మాస్కులను పంపిణీ చేశారు. పిల్లల్లో పండుగ ప్రాముఖ్యతను తెలియజేయడానికి ఈ కార్యక్రమాన్ని చేపట్టినట్లు ఆమె తెలిపారు.

బీజేపీ ఆధ్వర్యంలో హోలీ వేడుకలు..

హోలీ పండుగ వేడుకలను బీజేపీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. మంగళవారం ఆదిలాబాద్ పట్టణంలోని పార్టీ కార్యాలయం వద్ద నిర్వహించిన వేడుకలు ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా బీజేపీ శ్రేణులు ఆయనకు రంగులు పూసి పండగ శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి నృత్యాలు చేస్తూ సందడిగా గడిపారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు పాల్గొన్నారు.

సిరికొండ: మండల కేంద్రంతో పాటు మండలంలోని ఆయా గ్రామాల్లో సోన్‌పల్లి, పొన్న, రాంపూర్, వాయిపేట్, పోచంపల్లి, ధర్మసాగర్, రాయిగూడ, సుంకిడి తదితర గ్రామాలలో మంగళవారం హోలీ పండుగ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. చిన్నా పెద్ద అనే తారతామ్యం లేకుండా ఒకరికొకరు రంగులను పూసుకొని పండుగ వేడుకలు నిర్వహించుకున్నారు.



ఆదిలాబాద్‌టౌన్‌లో..



ఆదిలాబాద్‌టౌన్‌లో..

అబార్షన్ కిట్ల కలకలం...!

- అక్రమంగా తరలిస్తూ రోడ్డుపక్కన పారేసిన వైనం



నవతెలంగాణ-గుడిహత్నూర్

మండల కేంద్రానికి సమీపంలో డోంగర్‌గావ్ పంచాయతీ పరిధిలో ఇనకర్‌గూడ వెళ్ళే దారిలో జాతీయ రహదారి పక్కన పడేసి ఉన్న అబార్షన్ కిట్లు మండలంలో కలకలం రేపాయి. సుమారుగా 8వేలకు పైగా కిట్లు అందులో ఉన్నాయి. కాలపరిమితి ముగియకముందే ఈ కిట్లు ఇక్కడ పడవేసి ఉండటం పలు అనుమానాలకు దారితీస్తుంది. కిట్లపై చత్తీస్‌ఘడ్ రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో ఉచిత సరఫరా చేయడానికి తయారు చేసిన ఈ అబార్షన్ కిట్లను అక్రమంగా తరలించి సొమ్ము చేసుకునే ముఠానే ఈ సంఘటనకు పాల్పడి ఉంటుందని స్థానికులు చర్చించుకుంటున్నారు. ఒక్కొక్క కిట్టు మార్కెట్లో రూ.5 వందల ధర ఉండగా, అక్రమంగా ఒక్కో కిట్టు రెండు వేల వరకు ధర పలుకుతుందని పేర్కొన్నారు. దీన్ని ఆసరాగా చేసుకున్న అక్రమ వ్యాపారస్తులు బ్లాక్ మార్కెట్‌కు తరలించే ప్రయత్నంలో ఏదైనా ఇబ్బంది తలెత్తడంతో ఇక్కడ పడేసి ఉంటారని భావిస్తున్నారు. మండల కేంద్రానికి సమీపంలో అబార్షన్ కిట్లు పడేసి ఉన్న విషయాన్ని సమాచారం తెలుసుకున్న అందుకున్న జిల్లా వైద్య అధికార యంత్రాంగం మండల వైద్యాధికారి శ్యాంసుందర్‌ను సంఘటన స్థలానికి పంపించి వాటిని స్వాధీనం చేసుకున్నారు. స్వాధీనం చేసుకున్న అనంతరం వాటిని పోలీసులకు అప్పగించారు. స్వాధీనం చేసుకున్న కిట్ల విలువ సుమారు రూ.50 లక్షలు ఉంటుందని బ్లాక్ మార్కెట్లో దీని విలువ కోటిన్నరకు పైగా ఉంటుందని వైద్యాధికారి శ్యాంసుందర్ తెలిపారు. ఈ సంఘటనపై జిల్లా డ్రగ్ ఇన్స్‌పెక్టర్‌కు సమాచారం అందించామని వారి విచారణ అనంతరం పూర్తి వివరాలు వెల్లడిస్తామన్నారు.

ఆర్జీయూకేటీ యూనివర్సిటీకి హరితహారం అవార్డు

- మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా అవార్డు అందుకున్న వీసీ



నవతెలంగాణ-బాసర

ఆర్జీయూకేటీ యూనివర్సిటీకి హరితహారం అవార్డు వరించిందని యూనివర్సిటీ వీసీ వెంకటరమణ తెలిపారు. హైదరాబాద్‌లో మంగళవారం కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ వార్షిక సమావేశ సదస్సులో అదే సంస్థ అవార్డును ఐటి శాఖ మంత్రి కేటీఆర్ చేతుల మీదుగా యూనివర్సిటీ వీసీ వెంకటరమణ అందుకున్నారు. ఈ సందర్భంగా వీసీ వెంకటరమణ మాట్లాడుతూ ఆర్జీయూకేటీ యూనివర్సిటీలో 6 నెలల వ్యవధిలో భారీ ప్లాంటేషన్‌ను, ఈకో పార్క్, సరస్సు సుందరీకరణ చేపట్టినందుకు ఆర్జీయూకేటీకి సిఐఐ(కాన్ఫెడరేషన్ ఆఫ్ ఇండియన్ ఇండస్ట్రీ) సంస్థ హరితహారం అవార్డును అందజేసినట్లు తెలిపారు. ఈ సమావేశంలో ఐటి శాఖ మంత్రి కేటీఆర్ మాట్లాడుతూ ప్రతి మనషి ప్రకృతిని నిబద్ధతతో కాపాడాలని సీఎం కేసీఆర్ ఆలోచనకు రూపకల్పన హరితహారం కార్యక్రమానికి, పచ్చని తెలంగాణ కోసం అవిశ్రాంతంగా కృషి చేస్తున్నారని అన్నారు.అందులో భాగంగానే ఆర్జీయూకేటి యూనివర్సిటీ ఆ దిశలో పయనిస్తుందని దానికి వీసీ ప్రొఫెసర్ వెంకటరమణ కషి అభినందనీయమని కొనియాడారు. యూనివర్సిటీ అధికారులు, అధ్యాపకులు సిబ్బందిని అభినందించారు. పర్యావరణ పరిరక్షణకు మరింత సహకారం అందిస్తామని మంత్రి కేటీఆర్ హామీ ఇచ్చినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ యూనివర్సిటీకి అన్నివేళలా అండగా నిలిచిన మంత్రులు ఇంద్రకరణ్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డిలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేష్ రంజాన్, భారత్ బయోటెక్ ఎండీ సుచిత్ర ఎల్ల, ఆయా కంపెనీల సీఈఓలు పాల్గొన్నారు.

మహిళలు పురుషులతో సమానంగా ఎదగాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ హేమంత్ బోర్కాడే
- పోలీస్ హెడ్ క్వార్టర్‌లో మహిళా దినోత్సవ వేడుకలు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

మహిళలు పురుషులతో సమానంగా ఎదగాలని జిల్లా కలెక్టర్ హేమంత్ బోర్కాడే అన్నారు. జిల్లా కేంద్రంలోని పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో పోలీసుల ఆధ్వర్యంలో నిర్వహించిన మహిళా దినోత్సవ వేడుకలకు ఎస్పీ సురేష్‌కుమార్‌తో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహిళలు పురుషులతో పోటీపడి ఎదగాలన్నారు. ప్రభుత్వాలు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నాయని, వాటిని సద్వినియోగం చేసుకొని ముందుకు సాగాలన్నారు. గతంతో పోలిస్తే మహిళలు అభివృద్ధి చెందారని అన్నారు. ఎస్పీ సురేష్ కుమార్ మాట్లాడుతూ అతివలకు అసాధ్యం కానిది అంటూ ఏదిలేదని, అన్ని రంగాల్లో విశేష ప్రతిభ కనబరుస్తూ ముందుకు వెళ్తున్నారని హర్షం వ్యక్తం చేశారు. పురుషుల కన్నా మహిళకే పట్టుదల ఎక్కువ అని, కృషితో ఉద్యోగాలలో ఇతర రంగాల్లో పురుషులతో పోటీ పడుతున్నారని అన్నారు. ఇంటికి దీపం ఇల్లాలు అని, ఉన్నతంగా ఆలోచించిన మహిళ తన కుటుంబాన్ని ఉన్నత స్థాయికి చేర్చే సత్తా ఉందని తెలిపారు. పోలీస్ విభాగంలోని మహిళలకు చెస్, క్యారమ్, టగ్ ఆఫ్ వార్, పాటల పోటీలు నిర్వహించి, గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన సిబ్బందిని సన్మానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) అచ్చేశ్వరరావు, అదనపు ఎస్పీ (ఎఆర్) భీంరావు, డీఎస్పీలు శ్రీనివాస్, కరుణాకర్, సిఐలు, ఆర్‌ఐలు, ఎస్‌ఐలు, ఆర్‌ఎస్‌ఐలు, మహిళా పోలీస్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

అంతర్జాతీయ పోటీలకు మోడల్ స్కూల్ విద్యార్థి ఎంపిక



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలోని తెలంగాణ ఆదర్శ పాఠశాలకు చెందిన ఇంటర్ ప్రథమ సంవత్సరం విద్యార్థి రేకల తనిష్‌కు అంతర్జాతీయ స్థాయి సాఫ్ట్ బేస్ బాల్ పోటీలకు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్ తెలిపారు. డిసెంబర్ 28 నుండి 30 వరకు కేరళలో నిర్వహించిన జాతీయ స్థాయి ఎంపిక పోటీల్లో మోడల్ స్కూల్ ఇంటర్మీడియట్ విద్యార్థులు తనిష్క్, ఆర్.అంకిత్, ఆర్.ఎస్.కృష్ణ, సాయి అవినాష్‌లు పాల్గొని రజత పతకం సాధించగా, జాతీయ స్థాయి పోటీల్లో అత్యుత్తమ ప్రతిభ కనబర్చిన తనిష్క్ అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు. మే 15 నుంచి 20వ తేదీ వరకు భుటాన్‌లో నిర్వహించినున్న అంతర్జాతీయ స్థాయి పోటీల్లో భారత జట్టుకు ప్రాతినిధ్యం వహించనున్నట్టు తెలిపారు. ఈ సందర్భంగా అంతర్జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన తనిష్క్‌ను ప్రిన్సిపాల్ అబ్దుల్ ఖలీల్, వ్యాయామ ఉపాధ్యాయుడు బి.తిరుపతి, పాఠశాల యాజమాన్య కమిటీ చైర్మన్ ప్రేమ్ కుమార్ అభినందించారు.

అమ్మవారి సన్నిధిలో చతుర్వేద సహిత చండీ హోమం

నవతెలంగాణ-బాసర

సరస్వతిదేవి అమ్మవారి సన్నిధిలో మంగళవారం పౌర్ణమి పురస్కరించుకొని చతుర్వేద సరస్వతి సహిత మంత్ర చండీ హోమం నిర్వహించారు. ఆలయ స్థాన చార్యులు ప్రధాన అర్చకుల ఆధ్వర్యంలో అర్చకులు వేద పండితులు, ఉదయం 9 గంటలకు గణపతి పూజ, కలశ స్థాపన, రక్ష బంధనం, పుణ్యా వచనం, తదితర పూజలతో చండీ హోమం నిర్వహించారు. ఈ పూజ కార్యక్రమాలు భక్తులకు ఆలయం తరఫున ప్రసాద వితరణ చేపట్టారు.

'ఆమె'కు ప్రోత్సాహన్ని అందిస్తేనే మార్చి 8కి సార్థకత

- సీఐటీయూ నాయకురాలు బానోత్ సుజాత

నవతెలంగాణ-నిర్మల్



మహిళలకు ప్రధాన్యతను ఇచ్చి ప్రోత్సహన్ని అందిస్తేనే అంతర్జాతీయ మహిళ దినోత్సవానికి సార్థకత ఉంటుందని సీఐటీయూ నాయకురాలు బానోత్ సుజాత అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవం సందర్భంగా ఆమే నవతెలంగాణతో మాట్లాడారు. కేంద్రంలో అధికారంలో ఉన్న మతతత్వ బీజేపీ అనుసరించే మనుధర్మ సూత్రాల వల్ల న్యాయ వ్యవస్థల్లో, చట్టసభల్లో అధిపత్య భావజాలంతో ఇస్తున్న తీర్పులు, చేస్తున్న చట్టాలు మహిళల జీవితాలను మరింత అధోగతి పాలు చేస్తున్నాయి. ఉదాహరణకు పోక్సో చట్టం విషయంలో ముంబాయి హైకోర్టు తీర్పు, హత్రాస్ వంటి ఘటనల్లో అక్కడి పోలీస్ వ్యవస్థ వ్యవహరించిన తీరు ఇవన్నీ మహిళలు అభివృద్ధికి సవాళ్లుగానే ఉన్నాయి. 2023లోకి అడుగు పెట్టాం. అంతర్జాతీయ దినోత్సవం ప్రారంభమై 112ఏండ్లు గడిచినా మహిళా సాధికారిత కాగితాలకే పరిమితం అయ్యింది. మహిళలు కోరుకున్న సామాజిక, ఆర్థిక, రాజకీయ రంగాలు అన్నింటా అసమానత కొనసాగుతూనే ఉంది. 75ఏండ్ల స్వతంత్ర భారతంలో 545మంది సభ్యులు ఉన్న పార్లమెంట్‌లో కేవలం 12శాతం మహిళల స్థానం. మరో ప్రధాన సమస్య ఆహార భద్రత, 76శాతం మందికి సరిపడ క్యాలరీలు ఉన్న ఆహారం దొరకడం లేదు. 50శాతం స్త్రీలు రక్తహీనతతో బాధపడుతున్నారు. ఇన్ని సమస్యలు దాటి మహిళలు అభివృద్ధి చెందాలంటే ఈ వ్యవస్థని ప్రక్షాళన చేయకుండా ఎన్ని మార్చి 8లు వచ్చినా స్త్రీల జీవితాల్లో కొత్త వెలుగులు నింపలేం. మహిళల సమానత్వం అందరి బాధ్యతగా సమాజం గుర్తించి, మనిషిగా చూసే ధృక్పథం అలవర్చుకోవాలి. వివక్షపై ఇంటా, బయటా ప్రశ్నించే తత్వం పెరగాలి. ఆయా వ్యవస్థలు ప్రభుత్వాలు 'ఆమె'కు తగిన ప్రోత్సాహన్ని అందించాలి. అప్పుడే మార్చి 8కి సార్థకత ఉంటుంది.

తాతయ్య, నాన్న ప్రోత్సహంతోనే ఉద్యోగం సాధించా..!

- ఎంపీడీఓ రాధా రాథోడ్

నవతెలంగాణ-బజార్‌హత్నూర్



తాతయ్య, నాన్న ప్రోత్సహంతోనే ఎంపీడీఓగా ఉద్యోగాన్ని సాధించానని ఎంపీడీఓ రాధా రాథోడ్ అన్నారు. అంతర్జాతీయ మహిళ దినోత్సవాన్ని పురస్కరించుకొని నవతెలంగాణతో మాట్లాడారు. నా బాల్యం ఎక్కువగా తాతయ్య ఊర్లోనే గడిచింది. వారు నిత్యజీవితంలో పడుతున్న కష్టాలు, వారి జీవన విధానం వారు నిత్యం పడుతున్న ఇబ్బందులను కళ్లారా చూసేదాన్ని. జీవిత పరివర్తన రావాలంటే చదువు ఒకటే మార్గమని తెలుసుకొని తాతయ్య, నాన్న ప్రోత్సాహంతో విద్యనభ్యసించాను. పంచాయత్ రాజ్ శాఖలో ఉద్యోగాన్ని సంపాదించాను. మొదటి పోస్టింగ్ ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా కాసిపేట మండలంలో చేశాను. సిర్పూర్(టి), వాంకిడి, ఆసిఫాబాద్, జైనూర్, ఖానాపూర్, బోథ్ మండలాల్లో విధులు నిర్వహించాను, ప్రస్తుతం బజార్‌హత్నూర్ మండలంలో పనిచేస్తున్నాను. నేను ఎక్కడ విధులు నిర్వహించిన ప్రభుత్వ పథకాలను చివరి వ్యక్తికి అందేలా కృషి చేస్తాను. ఏ మండలానికి వెళ్లిన ఆ మండల విద్యా, వైద్య, ఆర్థిక స్థితిగతులను అధ్యయనం చేసి వారికి ప్రభుత్వ సంక్షేమ ఫలాలు అందేలా కృషి చేస్తాను. ఉమ్మడి జిల్లాలో పని చేయుటంలో మరాఠీ, గోండి, హిందీ, ఇంగ్లీష్ భాషలలో వారితో మాట్లాడి వారికి ఇంకా చేరువై సంక్షేమ పథకాల గూర్చి వివరంగా తెలిపి చైతన్య పర్చి వారి అభివృద్ధికి కృషి చేశాను. మహిళలు ఈ రోజు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. కుటుంబ సభ్యుల ప్రోత్సహం లేనిదే ఏది సాధించలేమని అన్నారు. అందరి ప్రోత్సహం ఉంటే మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తారని అన్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని పెద్ద మండలంలో ఒకటి అయినా ఖానాపూర్ మండలంలోని మారుమూల గ్రామమైన రాగి దుబ్బ సందర్శించినప్పుడు, అక్కడ తాగునీటి సమస్య నన్ను తీవ్రంగా కలిచి వేసింది. గ్రామస్తులందరితో మాట్లాడి రవాణా సౌకర్యం లేని గ్రామంలో శ్రమదానం చేయించి రోడ్డు వేయించాను. అనంతరం రెండు బోర్లు వేయించి, తాగునీటి సమస్యను తీర్చాను. ఇప్పటికీ వారు గుర్తు చేస్తూ ఉంటారు. చాలా ఆనందంగా ఉంటుంది బోథ్‌లో విధులు నిర్వహించినప్పుడు కూడా మారుమూల ప్రాంతాల రహదారులను ఉపాధి హామీ చట్టం ద్వారా ప్రజా ప్రతినిధులు సర్పంచ్ల సహకారంతో వేయించి, ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన హరితహారంలో భాగంగా నర్సరీలను అద్భుతంగా ఏర్పాటు చేసి రాష్ట్రస్థాయి అధికారుల ప్రశంసలు పొందాను. అధికారులు ప్రజలు ప్రజాప్రతినిధుల సహకారంతో జిల్లాలోని మొట్టమొదటిసారిగా కోవిడ్ వ్యాక్సిన్ వేయించి కోవిడ్ రహిత మండలంగా ప్రకటించడం జరిగింది. ఇందుకు స్వయంగా అదనపు కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ ప్రశంసించారు.

గిరిజన గూడాల్లో కామ దహనం

నవతెలంగాణ-కాసిపేట



మండలంలోని గిరిజన గ్రామాల్లో మంగళవారం కామ దహన కార్యక్రమం చేపట్టారు. తాటిగూడ గిరిజన గ్రామంలో కామ దహన కార్యక్రమం నిర్వహించి, ఈ ఏడాది కొత్త పంట జొన్నలతో రొట్టెలను తయారు చేసి ఆరగించారు. అనంతరం రాత్రి కోలాటం ఆడుతారు. బుధవారం హోలీ ఆడనున్నట్లు ఆదివాసీ గ్రామ పటేల్ తెలిపారు. ఈ కార్యక్రమంలో తాటిగూడ గ్రామ పటేల్ మడావి శేఖర్, గ్రామస్తులు మడావి వెంకటేశ్, మడావి మధూకర్, వెలాది అర్జున్, సిడం కమలాకర్, మడాది దిందరా, మడావి తిరుపతి. మడావి గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

అనుదినం జనస్వరం www.navatelangana.com

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

మంచిర్యాల

కుమురం భీం-ఆసిఫాబాద్

బుధవారం 08 మార్చి 2023

హాల్ టికెట్లను వెబ్ సైట్ నుండి డౌన్లోడ్ చేసుకోండి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ఇంటర్ బోర్డు వెబ్‌సైట్‌లో ఇంటర్ విద్యార్థుల హాల్ టికెట్లు అందుబాటులో ఉన్నాయని, అన్ని కళాశాలల యాజమాన్యాలు డౌన్ లోడ్ చేసుకోవచ్చని జిల్లా మాధ్యమిక విద్యాధికారి డా.శ్రీధర్ సుమన్ తెలిపారు. తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. 6వ తేదీ సాయంత్రం నుండే కళాశాలల లాగిన్‌లో ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం జనరల్, ఒకేషనల్ విద్యార్థుల హాల్ టికెట్లు పొందుపర్చారని తెలిపారు. హాల్ టికెట్లలో తప్పులుంటే విద్యార్థులు సరి చేసుకోవాలని సూచించారు. హాల్ టికెట్‌పై ప్రిన్సిపల్ సంతకం లేకున్నా పరీక్షకు అనుమతి ఉంటుందని స్పష్టం చేశారు. హాల్ టికెట్ల కోసం టీఎస్‌బీఐఈ.సీజీజీ.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌ను సందర్శించవచ్చన్నారు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పరీక్షలు మార్చి 15 నుంచి ఏప్రిల్ 1వ తేదీ వరకు కొనసాగనున్నాయన్నారు.

కష్టాలను ఎదుర్కొని..లక్ష్యాలను సాధిస్తూ..!

అసమానతలు పోవడంలేదు

టీఎస్ యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు వైద్య శాంతి కుమారి

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



75 సంవత్సరాల వజ్రోత్సవాలు జరుపుకుంటున్న తరుణంలో సైతం సమాజంలో మహిళలపై లింగ వివక్ష అసమానతలు పోవడం లేదు. ఈ సంవత్సరం మహిళా దినోత్సవాన్ని డిజిటల్ సాంకేతిక రంగంలో సమానతలు సాధించాలనే లక్ష్యంతో ముందుకు వస్తున్న తరుణంలో ఉగ్రవాదులు మతోన్మాదులు మహిళలను చీకటికి యుగంలోకి నెట్టివేస్తున్నాయి. ఇరాన్‌లో బాలిక విద్యను వ్యతిరేకించే మూకలు బాలికపై విద్యాలయాలపై విషవాయువుల ప్రయోగించినట్లు నేడు ప్రభుత్వాలు నూతన జాతీయ విద్యా విధానం పేరుతో బాలికలను విద్యకు దూరం చేసే అనేక అంశాలు ఉన్నాయి. బాలిక విద్యను దూరం చేసే విధంగా ఉన్న ప్రభుత్వ ఆలోచనలను తిప్పి కొట్టే దిశగా మహిళల్లో బాలికల్లో చైతన్యం రావాలి. పోరాటానికి సిద్ధం కావాలి. బాలికలకు ఆత్మరక్షణ కోసం అన్ని పాఠశాలల్లో కరాటే విద్యను నేర్పించే విధంగా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలి. కౌన్సిలింగ్ సెంటర్లను నిర్వహించాలి. ఒకవైపు ఆధునిక మార్కెట్ స్త్రీని సరుకుగా మారిస్తే ఈ మత చాందసం బానిసగా మార్చే ప్రయత్నం చేస్తున్నది. ఈ వివక్షతను ఎదుర్కొంటున్న మహిళల్లో చైతన్యం వచ్చి పోరాటం చేసి అసమానతలు రూపుమాపిన రోజే నిజమైన మహిళ సాధికారత సాధించినట్లు గుర్తించాలి.

లింగ వివక్షను రూపుమాపాలి

బీఆర్ఎస్ మహిళా విభాగం నాయకురాలు నరేడ్ల కల్పన

నవతెలంగాణ-రామకష్టాపూర్



అంతర్జాతీయ మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని బిఆర్ఎస్ పార్టీ మహిళా నాయకురాలు నరేడ్ల కల్పన మాట్లాడుతూ ప్రపంచవ్యాప్తంగా మహిళలను గౌరవించడానికి ప్రతి ఏటా మార్చి 8వ తేదీన అంతర్జాతీయ మహిళా దినోత్సవం జరుపుకుంటాం. మహిళా దినోత్సవాన్ని తెలంగాణ ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించడానికి హర్షిస్తున్నాం. లింగ సమానత్వం, హింస, మహిళలకు సమాన హక్కులు కావాలంటూ ఎంతో మంది మహిళలు చేసిన పోరాట ఫలితమే మహిళా దినోత్సవం. మహిళలు తమ వ్యక్తిత్వాన్ని కాపాడుకోవడానికి హక్కుల సాధనకు ఎన్నో పోరాటాలను ఒక్కో దేశంలో ఒక్కో పద్ధతిలో చేశారు. కానీ ఎవరు ఎటువంటి పద్ధతిలో పోరాటాలు చేసిన అవన్నీ మహిళల హక్కుల కోసమేనని అన్నారు.

ప్రజా సేవలోనూ ముందుంటాం

ఉత్తమ సర్పంచ్ శిరీష గోపాల్‌రెడ్డి

నవతెలంగాణ-జన్నారం



మండలంలోని దేవునిగూడా గ్రామపంచాయతీని అన్ని విధాలుగా అభివద్ధి చేస్తేనే తనకు ఉత్తమ సర్పంచ్గా అవార్డు దక్కిందని ఆ గ్రామ సర్పంచి గుర్రం శిరీష గోపాల్ రెడ్డి పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ ప్రజా సంక్షేమ పథకాలను ప్రజలకు అందించడంలో ముందున్నామన్నారు. ప్రతి పథకాన్ని ప్రారంభ దశలోనే పూర్తి చేసామన్నారు. గ్రామాన్ని మరింత అభివృద్ధి చేయడానికి ఇంటి పన్ను ముందుగానే వసూలు చేయడం జరిగిందన్నారు. గ్రామంలో అన్ని వాడలలో మంచినీటి ఎద్దడి లేకుండా ప్రత్యేక చర్యలు తీసుకున్నామని తెలిపారు. అన్ని వాడలలో పూర్తిస్థాయిలో వీధిలైట్లను ఏర్పాటు చేశామన్నారు.. పారిశుధ్యం పనులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామన్నారు. అలాగే గ్రామంలో దళితులు ఎక్కువగా ఉన్నందున వారికి 12 మందికి 10 లక్షల చొప్పున దళిత బంధు పథకాన్ని ఖానాపూర్ ఎమ్మెల్యే రేఖా శ్యాం నాయక్ సహకారంతో అందించడం జరిగిందన్నారు. ఉత్తమ గ్రామ సర్పంచ్‌గా ఎన్నిక కావడానికి మండల అధికారుల ప్రోత్సాహం ఎంతో ఉదని తెలిపారు.

సొంత నిర్ణయాలు తీసుకునే స్వేచ్ఛ ఉండాలి

ప్రవలిక, ప్రైవేట్ అధ్యాపకురాలు

నవతెలంగాణ-కాగజ్‌నగర్ రూరల్



ఆకాశంలో సగం అవనిలో సగం ఉంటున్నప్పటికీ మహిళలు మార్చి 8 రాగానే మహిళలు సమాధానత అంటూ శుభాకాంక్షలు తెలియ చేసుకోవడంలోనే సరిపోదు. పై స్థాయిలో ఉన్న కొందరని మాత్రమే చూపిస్తూ మహిళా సాధికారత సాధించారని చెప్పుకోవడంలో ఇంతకంటే అతిశయోక్తి లేదు. డిజిటల్ సాంకేతిక రంగాలలో సమానతలు సాధించాలనే లక్ష్యం ఉన్నప్పటికీ సాధిస్తున్నాం సాధికారత అని చెప్పుకుంటున్నప్పటికీ కుమురంభీం లాంటి జిల్లాలో గిరిజన ఆదివాసి మహిళల జీవితాల్లో ఇలాంటి మార్పు లేదు. బాలికలు విద్యకు దూరం మూఢనమ్మకాలు లింగ వివక్ష ఇంకా శ్రమ దోపిడికి గురి అవుతూనే ఉన్నారు. రాష్ట్రంలో మహిళలపై జరుగుతున్న అత్యాచారాలు ఈ మధ్యకాలంలో ప్రేమ ర్యాగింగ్ల పేరుతో అమ్మాయిలు చేసుకుంటున్నా ఆత్మహత్యలు మాత్రమే కాకుండా ఇవి కులపరమైన వివక్షక కూడా కొనసాగుతూ పురుషాధిక్య సమాజాన్ని చూపిస్తున్నాయి. రాజకీయాల్లో ఉన్న మహిళలు కేవలం నామ మాత్రం పదవుల్లో కాకుండా వారు పూర్తి అవగాహనతో సొంత నిర్ణయాలు తీసుకునే విధంగా ఉండాలి.

ఘనంగా హోలీ సంబరాలు

నవతెలంగాణ-జన్నారం

మండలంలో హోలీ సంబరాలు మంగళవారం అంబరాన్నంటాయి. ఉదయం ఏడు గంటల నుంచి రంగులతో చిన్నారుల నుంచి వృద్ధుల వరకు రంగవల్లులు ఒకరిపై ఒకరు చల్లుకొని పండుగ జరుపుకున్నారు. స్థానిక జడ్పీటీసీ ఎర్ర చంద్రశేఖర్ ఎంపీపీ మాదాడి సరోజన రవీందర్రావు, వైస్ ఎంపీపీ సుతార్ వినయ్ కుమార్, కోఆప్షన్ సభ్యులు మున్వర్ అలీ ఖాన్ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీపతి పద్మ బుచ్చన్న, ఏఎంసి వైస్ చైర్మన్ గోట్ల రాజేష్ యాదవ్, సర్పంచ్‌ల సంఘం జాడి గంగాధర్, ఎంపీటీసీల ఫోరం జిల్లా అధ్యక్షుడు మహమ్మద్ రియాజుద్దీన్, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీ అన్ని పార్టీల నాయకులు ప్రజాప్రతినిధులు ఉద్యోగస్తులు హోలీ వేడుకల్లో పాల్గొన్నారు.

తెలంగాణలో మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత

కోవలక్ష్మీ, జడ్పీ చైర్‌పర్సన్, కుమురంభీం-ఆసిఫాబాద్

నవతెలంగాణ-జైనూర్



ప్రత్యేక తెలంగాణ సాధించినప్పటి నుండి తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళలకు అన్ని విధాలుగా రాజకీయాల్లో ప్రత్యేక ప్రాధాన్యత కల్పిస్తున్నారు. నేటి సమాజంలో మహిళల పాత్ర ఎంతో ఉంది. చట్టం ప్రకారం మహిళలకు 50 శాతం రిజర్వేషన్ కల్పించి మహిళలకు అన్ని విధాలుగా అభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపడుతుంది. మహిళలకు ప్రత్యేక రిజర్వేషన్ కావడంతోనే నా జీవితంలో మొదటిసారిగా సర్పంచ్, ఎంపీపీ లాంటి పదవిలో తిర్యాణి, ఆసిఫాబాద్‌లో ప్రజలకు ఎన్నో సేవలు చేశాను. అదేవిధంగా రిజర్వేషన్‌తోనే గతంలో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భావంలో ఐదేండ్లు ఎమ్మెల్యేగా పనిచేశాను. కుమురంభీం ఆసిఫాబాద్ జిల్లా నూతనంగా ఏర్పడటంతో తొలి జడ్పీ చైర్‌పర్సన్‌గా ముఖ్యమంత్రి అవకాశం కల్పించారు. మహిళలు చదువుతో పాటు రాజకీయాల్లోనూ ఎదిగి ముందుకుసాగాలని ఆకాంక్షిస్తున్నాను.

రాజకీయాల్లో రాణించాలి

దోకే రోజారమణి, ఎంపీపీ బెజ్జూర్

నవతెలంగాణ-బెజ్జూర్



రాజకీయ రంగంలో మహిళలు ఇంకా రాణించాల్సిన అవసరం ఉంది. బెజ్జూర్ మండలంలో ఎక్కువ మంది మహిళా ప్రజా ప్రతినిధులే ఉన్నారు. మహిళా ప్రజాప్రతినిధులకు రాజకీయాలపై ప్రత్యేక శిక్షణను అందించి వారిని ఇంకా ప్రోత్సహించాలి. మహిళా దినోత్సవాన్ని ప్రభుత్వాలు ఒక పండగలా నిర్వహించాలి.

పట్టుదలతో గ్రూప్-2 ఉద్యోగం సాదించి

నవతెలంగాణ-తాండూర్



సమాజంలో స్త్రీలు ఉద్యోగం చేయడానికి భయపడుతున్న రోజుల్లో నిర్ణయాత్మకమైన ఆలోచనలతో ఒత్తిళ్లకు లొంగకుండా పట్టుదలతో గ్రూప్-2లో విజయం సాధించి ఎక్సైజ్ సబ్ ఇన్స్‌పెక్టర్‌గా ఉద్యోగం సాధించారు. నిర్మల ఆదిలాబాద్ జిల్లా పిప్పలదరి గ్రామ వ్యవసాయ కుటుంబంలో జన్మించిన నిర్మల ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తూనే గ్రూపు-1కు ప్రిపేర్ అవుతున్నారు. నిర్మల్ జిల్లా జగిత్యాలలో పనిచేసిన నిర్మల ప్రస్తుతం బెల్లంపల్లి ఎక్సైజ్ అండ్ ప్రొబేషన్ శాఖలో విధులు నిర్వహిస్తున్నారు. ఆటంకాలను సవాళ్లను ఎదుర్కొని ముందుకు సాగినప్పుడే మహిళలు పురోగతి సాధిస్తారని తెలిపారు. సమాజంలో లింగ వివక్షత జాతి వివక్షత నిర్మూలించినప్పుడే స్త్రీకి సంపూర్ణ స్వేచ్ఛ లభిస్తుందని నిర్మల తెలిపారు.

మహిళల కోసం అనేక పథకాలు

దుబ్బుల శ్రీదేవి, జడ్పీటీసీ చింతలమానేపల్లి

నవతెలంగాణ-చింతలమానేపల్లి



మహిళలకు ప్రభుత్వం చట్టసభల్లో స్థానం కల్పించింది. ఎంతో మంది మహిళలు వంటింటికి పరి మితం కాకుండా రిజర్వేషన్ల ద్వారా అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. వివిధ రంగాల్లో మహిళలకు అవకాశం కల్పిం చడం, వారి ఆర్థికాభివద్ధికి దోహద పడడం సంతోషకరం. అదేవిధంగా మహిళలు చట్టాలపై అవగాహన కలిగి ఉండాలి. పురుషులతో సమానంగా రాజకీయంగా, ఆర్థికంగా రాణించాలి. మహిళలు ఆర్థికంగా అభివద్ధి చెందినప్పుడే అన్ని రంగాల్లో రాణించగలరు. ప్రజాసేవలో ముందుండి ఇతరులకు ఆదర్శంగా ఉండాలి. సామాజిక సేవలో తమ వంతు సేవ భావం కలిగి ఉండాలి. మహిళల సంరక్షణ కోసం ప్రభుత్వం వివిధ పథకాలను అమలు చేస్తోంది.

సమానత్వం కోసంమే మహిళా దినోత్సవం

కోటపల్లి ఎంపీపీ మంత్రి సురేఖ

నవతెలంగాణ-కోటపల్లి



మహిళల హక్కులను గుర్తించడానికి, సమాజంలో వివక్షకు గురవుతున్న మహిళలకు సమానంత్వ లభించాలనే ఉద్దేశంతో అంతర్జాతీయ మహిళా దినోత్సవం నిర్వహిస్తున్నారని ఎంపీపీ మంత్రి సురేఖ అన్నారు. భారత రాజ్యాంగం మహిళలు, పురుషులకు సమాన హక్కులు కల్పించిందన్నారు. మహిళలు జనాభాలో సగానికి పైగా ఉన్నా వారికి హక్కులు అందడం లేదన్నారు. భారత దేశంలో మాత్రమే స్త్రీ సమానత్వం ఉందని తెలిపారు. మహిళలు సైతం దేశాన్ని పరిపాలించే స్థాయికి భారత దేశం వెళ్లిందని వివరించారు. ఆడపిల్లల తల్లిదండ్రులు బాలికల పట్ల వివక్ష చూపకుండా విద్యాబుద్ధులు నేర్పించి బంగారు బవిష్యత్‌ను అందించాలని అన్నారు. మహిళలు అన్ని రంగాల్లో రాణించి తమ ప్రతిభను చాటుకోవాలన్నారు. మారుతున్న కాలనికి అనుకూలంగా మహిళలు చైతన్యం కావాల్సిన అవసరం ఉందన్నారు.

బోయపల్లి ఉత్తమ సర్పంచ్ మాసాడి శ్రీదేవి

నవతెలంగాణ-తాండూర్



తాండూర్ మండలం బోయపల్లి గ్రామానికి చెందిన మాసాడి శ్రీదేవి రాజకీయ రంగంలో రాణిస్తూ ప్రస్తుతం బుగ్గ ఆలయ కమిటీ చైర్మన్ గా కొనసాగుతున్నారు. సోషలాజి లో ఎంఏ చదివిన శ్రీదేవి ఎంపీటీసీగా తాండూరు ఎంపీపీగా కొనసాగారు. మహిళా సాధికారత స్త్రీ స్వేచ్ఛపై అవగాహన కలిగి ఉన్న శ్రీదేవి తన సొంత ఇంటి కోడలికి వితంతు వివాహాన్ని చేసి సాంఘిక దురాచార నిర్మూలనకు తమ వంతు బాధ్యతను నిర్వర్తించారు. ప్రజాభివద్ధి సేవ కార్యక్రమంలో భాగంగా సామూహిక వివాహాలు, ఆలయాల్లో అన్నదాన కార్యక్రమాలు నిర్వహిస్తుంటారు. సమాజ సేవలో ప్రతి మహిళ తమ వంతు బాధ్యతను నిర్వహించాలని శ్రీదేవి తెలిపారు. గ్రామాన్ని ఉత్తమంగా అభివద్ధి చేస్తేనే ఉత్తమ గ్రామపంచాయతీ సర్పంచ్‌గా అవార్డు దక్కింది.

- ఉద్యోగాల్లో పురుషులకు పోటీగా రాణిస్తున్న మహిళలు

సమాజంలో ఎన్నో రకాల వ్యక్తిత్వాలు గల వ్యక్తుల మధ్య తనకంటూ ఒక ప్రత్యేక స్థానం అహర్నిశలు తపిస్తూ ఒడిదుడుకులను తట్టుకుంటూ అనేక మంది మహిళలు ముందుకు సాగుతున్నారు. తల్లిగా, చెల్లిగా, భార్యగా, కూతురుగా తన విదులు నిర్వహిస్తునే ఉద్యోగ జీవితంలో తమకంటూ గుర్తింపు తెచ్చుకుంటున్న ఎంతోమంది మహిళలు కనిపిస్తున్నారు. అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

నవతెలంగాణ-ఆసిఫాబాద్.

అటవీ రక్షణకు స్వప్న కృషి



ఆసిఫాబాద్ డివిజన్ పరిధిలో అటవీ బీట్ అధికారిగా విధులు నిర్వహిస్తున్న దైద స్వప్న అటవీ రక్షణలో ప్రత్యేక కృషి చేస్తోంది ఈ సందర్భంగా తన అభిప్రాయం చెబుతూ అటవీ రక్షణ అనేది కత్తి మీద సామ లాంటిది. ఉన్నతాధికారులు సహకరించడంతో పాటు ప్రజల సహాయ సహకారాలు అందినప్పుడే అటవీ సంరక్షణ సాధ్యమవుతుంది. ఉన్నతాధికారులు ఇచ్చిన ప్రత్యేక అప్లికేషన్లతో ప్రతిరోజు అటవీ సంరక్షణలో భాగంగా అడవిలో తిరుగుతాము. దీనితో పాటు రాత్రిపూట నైట్ పెట్రోలింగ్ నిర్వహిస్తున్నాము. ఇతర ఉద్యోగాలతో పోల్చినట్లయితే అటవీ శాఖలో మహిళలకు కొంత ఇబ్బందిగానే ఉంటుంది. ఉన్నతాధికారుల సహకారం లేనిదే ఉద్యోగం చేయడం కష్టమవుతుంది. అటవీ శాఖలో మహిళ ఉద్యోగులకు కొంత వెసులుబాటు ఇస్తే బాగుంటుంది.

మహిళలంటే చిన్నచూపు పోవాలి

శిరీష, డిగ్రీ కళాశాల అధ్యాపకురాలు



మహిళలంటే సమాజంలో ఉన్న చిన్నచూపు పోవాలి. ఇది తల్లిదండ్రుల వద్ద నుండి ప్రారంభం కావాలి. చిన్నప్పట్నుండి ఇంట్లో పిల్లలను ఒకే రకంగా పెంచడం జరిగితే మార్పు అక్కడే ప్రారంభమవుతుంది. ఎన్నో రకాల ఇబ్బందులు వస్తున్నప్పటికీ కుటుంబ సభ్యుల సహాయ సహకారాలతో వాటిని అధిగమిస్తూ వెళ్తున్నాను. చిన్ననాటి నుండి ఉద్యోగం చేయాలని ఆకాంక్షతో చదువుపై పట్టు సాధించాను. కుటుంబ సభ్యులు ఉద్యోగం చేయడానికి నాకు సహకారం ఇవ్వడం నా కల నెరవేరడానికి దోహద పడింది.

మహిళలు అన్ని రంగాల్లో రాణిస్తున్నారు

కరుణ, ఐసీడీఎస్ సూపర్‌వైజర్, బెజ్జూర్

నవతెలంగాణ-బెజ్జూర్



మహిళలు ప్రస్తుతం అన్ని రంగాల్లో రాణిస్తున్నారు. ఉద్యోగాలు, చదువుల్లోనూ ముందుంటున్నారు. కానీ మహిళల పట్ల ఇంకా కొంత వివక్ష ఉంది. అది పూర్తిగా పోవాలి. మహిళలపై జరుగుతున్న దాడులను అరికట్టడానికి ప్రభుత్వలు చట్టాలను కఠినంగా అమలు చేయాలి. 33శాతం రిజర్వేషన్లను అమలు చేస్తే మరింత మందికి అవకాశాలు మెరుగుపడుతాయి.

బెల్లపల్లి సీడీపీఓ ఉమాదేవి

నవతెలంగాణ-తాండూర్



బెల్లంపల్లిలో కార్మిక కుటుంబంలో జన్మించిన ఉమాదేవి బెల్లంపల్లి సీఎస్ఐ స్కూల్లో విద్యనభ్యసించి ఎమ్మెస్సీ హోం సైన్స్‌లో పట్టా పొందారు. ప్రస్తుతం బెల్లంపల్లి నియోజకవర్గంలో సీడీపీఓగా నిధులు నిర్వహిస్తున్నారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలోని వాంకిడి, ఖానాపూర్, బోథ్‌లో పని చేసిన ఉమాదేవి ప్రస్తుతం తన సొంత నియోజకవర్గంలో సేవలందిస్తున్నారు. రాష్ట్రస్థాయిలో 2014లో ఉత్తమ సీడీపీఓగా అవార్డును అందుకున్నారు. స్త్రీ శిశు సంక్షేమం శాఖ ద్వారా లింగ వివక్షత అక్షరాస్యత పౌష్టికాహారం ఆరోగ్యం విషయాలలో మహిళలకు అవగాహన కల్పిస్తూ మహిళా వికాసానికి తోడ్పడుతున్నారు. మహిళలు పురుషులతో సమానంగా రాణించినప్పుడే పురోగతి సాధించవచ్చునని ఉమాదేవి తెలిపారు.

పట్టుదలతో తాహసిల్దార్ ఉద్యోగం

నవతెలంగాణ-తాండూర్.



బాలికలపై నిర్బంధ విద్య కొనసాగుతున్న రోజుల్లో అమ్మానాన్నల ప్రోద్భలంతో పట్టుదలతో చదివిన తహసీల్దార్ కవిత రెవెన్యూ శాఖలో ఉద్యోగం సంపాదించారు. బెల్లంపల్లి గర్ల్స్ హైస్కూల్‌లో తమ ఇద్దరు చెల్లెళ్లతో పదవ తరగతి పూర్తిచేసిన కవిత కాకతీయ యూనివర్సిటీలో మాస్టర్ డిగ్రీ పట్టా పొందారు. బెల్లంపల్లి నియోజకవర్గంలోని కాసిపేట, భీమిని మండలాల్లో తహసీల్దార్‌గా విధులు నిర్వహించిన కవిత ప్రస్తుతం తాండూరు విధులు నిర్వహిస్తున్నారు. ఉద్యోగ బాధ్యతల్లో భాగంగా ప్రతి నెల జరిగే పౌర హక్కుల దినోత్సవంలో ప్రజలకు సాంఘిక దురాచారం, వరకట్న దురాచారం, కుల వ్యవస్థ నిర్మూలన , బాల కార్మిక వ్యవస్థ, అక్షరాస్యత బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తూ ప్రజలను చైతన్య పరుస్తున్నారు. రెడ్ క్రాస్ సొసైటీ ద్వారా రెవెన్యూ శాఖలో రక్తదాన శిబిరాలను ఏర్పాటు చేసి సామాజిక సేవలో పాలుపంచుకుంటున్నారు. పంచాయతీరాజ్ వ్యవస్థ నుండి చట్టసభల వరకు స్త్రీ తన హక్కులను బాధ్యతలను గుర్తించి సద్వినియోగం చేసుకున్నప్పుడే మహిళా సాధికారత సాధ్యమవుతుందని కవిత తెలిపారు. స్త్రీ ఇంటి బాధ్యతలతో పాటు స్వశక్తితో నిర్ణయాలను తీసుకోవాలని ఆమె సూచించారు.

ఘనంగా పటణంలో హోలీ సంబరాలు

రామకృష్ణాపూర్ : పట్టణంలో హోలీ సంబరాలు మంగళవారం అంజరానంటాయి. స్థానిక బీఆర్ఎస్ నాయకులు, వివిధ పార్టీ నాయకులు ఒకరి కొకరు రంగులు వేసుకుని శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్, పట్టణ ఇన్‌ఛార్జి గాండ్ల సమ్మయ్య, కౌన్సిలర్లు సంబరాల్లో పాల్గొన్నారు.

కష్టాన్ని మెట్టుగా చేసుకుని లక్ష్యాన్ని సాధించిన సోనీ



జిల్లాలో మిషన్ భగీరథ గ్రిడ్ లో ఏఈగా విధులు నిర్వహిస్తున్న దురిశెట్టి సోనీ కష్టాలను మెట్టుగా చేసుకుని లక్ష్యాన్ని సాధించింది. చిన్నతనంలోనే తండ్రిని కోల్పోవడంతో పాటు ఊహ తెలిసిన తర్వాత తమ్ముడు కూడా చనిపోవడంతో పరిస్థితి దారుణంగా తయారైంది. అమ్మ ప్రతిరోజు కూలికి వెళ్లి వచ్చిన కూలి డబ్బులతో చదువు పూర్తి చేశాను. దేవాపూర్‌లో పదవ తరగతి వరకు చదివి బాసర త్రిపుల్ ఐటీ లో సీటు సాధించి కోర్సు పూర్తి చేసి ఉద్యోగం సంపాదించాను. నేను అనుభవించిన పేదరికం నాకు ఎన్నో అనుభవాలను నేర్పింది. ప్రస్తుతానికి అనుకున్న స్థానాన్ని సాధించి సంతోషంగా ఉన్నాను. మిషన్ భగీరథ ఫీల్డ్ వర్క్ కావడంతో కొన్ని ఇబ్బందులు తలెత్తుతున్నాయి.

సమాన ప్రాతినిధ్యం ఉంటేనే సాధికారత

నగునూరి నీరజ గౌడ్, మోకుదెబ్బ గౌడ మహిళ రాష్ట్ర అధ్యక్షులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్



'యత్ర నార్యస్తు పూజ్యంతే రమంతే తత్ర దేవతా' అని చెప్పే ఈ దేశంలో స్త్రీలను దేవతలను చేయకపోయినా, మనిషిగా ఆమె హక్కులను, స్వేచ్ఛను, వ్యక్తిత్వాన్ని గౌరవించే ప్రతి ఒక్కరికీ 'మహిళా దినోత్సవ శుభాకాంక్షలు'. నేటి మహిళ అన్ని రంగాల్లోనూ తన సత్తా చాటుతోంది. ఆకాశమే హద్దుగా రెక్కలు విప్పుతోంది. అవకాశం ఇవ్వాలేగానీ తాము ఎవ్వరికీ తీసిపోమని, కృషిలో, మేధస్సులో అగ్రగామిగా నిలుస్తామని నిరూపిస్తోంది. ఎన్ని ఒడిదుడుకులు ఎదురైనా ముందుకు సాగుతామని ఆత్మవిశ్వాసంతో అడుగులు వేస్తోంది. కుటుంబంలో మహిళల పాత్ర ఎంత కీలకమైనదో సమాజంలోనూ అంతే కీలకం. ఇప్పుడు మహిళలు అడుగు పెట్టని రంగమంటూ లేదు. ప్రపంచంలో సగభాగంగా వున్న మహిళలకు సమాన ప్రాతినిధ్యం లేకుండా ఏ రంగమూ పురోగమించలేదు.

తొలి ప్రయత్నంలోనే ఎస్సైగా మానస

నవతెలంగాణ-నస్పూర్



వరంగల్ జిల్లా నల్లబెల్లి మారుమూల గ్రామంలో వ్యవసాయం చేసుకునే రామ్ లాల్ -రాజమణి రెండవ కుమార్తె మానస తొలి ప్రయత్నంలోనే ఎస్సై ఉద్యోగం సాదించింది. ప్రస్తుతం శ్రీరాంపూర్‌లో సబ్ ఇన్స్‌పెక్టర్‌గా విధులు నిర్వహిస్తున్నారు. చిన్నప్పటి నుంచి పట్టుదలతో చదువుతూ వరంగల్ ఎన్ఐటీలో చదువుకుంటూనే సబ్ ఇన్స్‌పెక్టర్ ఉద్యోగానికి అర్హత సాధించింది. మొదట ఎస్సైగా 2018లో మాదారం పోలీస్‌స్టేషన్‌లో విధులు నిర్వహించి ప్రస్తుతం శ్రీరాంపూర్ పోలీస్‌స్టేషన్ సబ్ ఇన్స్‌పెక్టర్‌గా పని చేస్తుంది. ఆత్మస్థైర్యంతో చదివితే విజయం సాధించవచ్చని ఎస్సై, కానిస్టేబుల్ అర్హత సాధించిన వారికి పలు సూచనలు చేశారు. మహిళలు అన్ని రంగాల్లో పురుషులతో పాటు సమానంగా రాణించాలని సూచించారు.

ఉన్నత విద్య తోనే మహిళలకు గుర్తింపు

ఆర్.రమాదేవి, ప్రిన్సిపాల్ కేజీబీవీ

నవతెలంగాణ-దహేగాం



ఉన్నత మైన విద్య తోనే మహిళలకు గుర్తింపు లభిస్తుందని కేజీబీవీ ప్రిన్సిపాల్ ఆర్.రమాదేవి అన్నారు. నేడు ప్రపచవ్యాప్తంగా మహిళలు అన్ని రంగాల్లో రానిస్తున్నరంటే దానికి కారణం చదువే అన్నారు. విద్యనభ్యసించని మహిళలకు సమాజంలో గుర్తింపు చాలా తక్కువ గతంలో మహిళ విద్యపట్ల ప్రోత్సాహం లేపోవటంతో వివక్షకు గురయ్యారన్నారు. ప్రస్తుతం మహిళల చదువు కోసం ప్రత్యేక పాఠశాలలు ఉన్నాయని, ప్రభుత్వాలు ప్రత్యేక వసతులు కల్పిస్తూన్నాయని అన్నారు. మహిళలు ఏరంగంలోనైనా సనమని నిరుపిస్తున్నాట్టు వివరించారు. రానున్న రోజుల్లో సైతం ఇంకా ఉన్నత విద్యను అందిపుచ్చుకుని అత్యున్నత శిఖరాలు అధిక బాగం మహిళలు ఉండాలని కోరుకుంటు న్నానని ఆశాభావం వ్యక్తం చేశారు.

అవకాశాలను అందిపుచ్చుకోవాలి

కల్పన ఏపీఓ దహేగాం

నవతెలంగాణ-దహేగాం



మహిళలు అన్ని అవకాలను అందిపుచ్చుకోవాలని ఏపీఓ కల్పన అన్నారు. నేటి సమాజంలో మహిళల కోసం అనేక అవకాశాలు ఉన్నప్పటికీ చాలా మంది మహిళలు అవకాశాలు సద్వినియోగం చేసుకోవడంలో వెనకబడి పోతున్నారు. నేడు భూ మార్గం నుండి మొదలు కొంటె వారు జల అన్ని రంగాల్లో మహిళలు రాణిస్తున్న సమాజంలో మాత్రం ఇంకా ఎక్కడో మహిళ అనగానే చిన్న చూపు చూస్తున్నారు. ఇప్పటికే సమాజంలో మహిళల హక్కుల కోసం పోరాటాలు సాగుతున్నాయి. ప్రతి రోజు ఎక్కడో అక్కడ మహిళపై దాడులు జరుగుతున్నాయి. ఇవి అన్నీ తొలగిపోవాలంటే కటినమైన చట్టాలు అమలు చేయాలి.

10న రక్తదాన శిబిరం

నవతెలంగాణ-కాసిపేట

సోమగూడెం సమీపంలోని కల్వరీ చర్చ్ మినిస్ట్రీస్‌లో ఈ నెల 10వ తేదీన కల్వరీ మినిస్ట్రీస్ ఫౌండేషన్, కాసిపేట మండల రెవెన్యూ శాఖ ఆధ్వర్యంలో సంయుక్తంగా రెడ్ క్రాస్ సొసైటీ సహకారంతో మెగా రక్తదానం శిబిరం నిర్వహిస్తున్నట్లు కల్వరీ మినిస్ట్రీస్ ఫౌండేషన్ చైర్మన్, నిర్వాహకులు పాస్టర్ ప్రవీణ్, సిస్టర్ షారోన్ తెలిపారు. మార్చి 10వ తేదీన ఉదయం 7 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు రక్తదాన శిబిరం నిర్వహించనున్నట్లు, అధిక సంఖ్యలో పాల్గొని రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలని ప్రజలను కోరారు.